సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
గురువారం । 29 । మే । 2025



పుష్కరాల ఆదాయం రూ.2.83కోట్లు

సరస్వతీ నది పుష్కరాల్లో కాళేశ్వరాలయానికి రూ.2.83కోట్ల ఆదాయం సమకూరినట్లు ఈఓ మహేశ్ తెలిపారు.

- 8లో▸



అక్రమార్కులపై చర్యలేవి?

టీజీ ఎన్పీడీసీఎల్‌లో చేపట్టిన సబ్ ఇంజనీర్ల రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు జరిగినా.. బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0^0 / 26.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బొగ్గు ఉత్పత్తిని పెంచాలి



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలో ఓపెన్‌కాస్టులో బొగ్గు ఉత్పత్తిని పెంచాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఏరియాలోని కేటీకే ఓసీ–2లో నూతనంగా కొనుగోలు చేసిన షావల్ వాహనాన్ని బుధవారం జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ రూ.1.71కోట్లతో కొనుగోలు చేసిన వాహనానికి సరస్వతి అని నామకరణం చేసినట్లు తెలిపారు. ఈ షావల్ యంత్రం లేకపోవడంతో గంటకు రూ.7వేల నష్టం సింగరేణికి వాటిల్లుతుందన్నారు. దీంతో బొగ్గు ఉత్పత్తి చేసి ముందంజలో ఉండాలని సూచించారు. ఉద్యోగులకు కేటాయించిన 8 గంటల పనిని తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, ఏర్రన్న, ప్రసాద్, వెంకటరమణ, భిక్షమయ్య, రాజరావు, కిష్టయ్య, నజీర్, కార్మిక సంఘాల నాయకులు రమేష్, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఓగా బాధ్యతల స్వీకరణ



భూపాలపల్లి రూరల్: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా డీఆర్‌డీఓగా పారిక బాలకృష్ణ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన నరేష్ జగిత్యాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ కార్యాలయం సిబ్బంది బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

'చలో వరంగల్'ను జయప్రదం చేయాలి'



వాజేడు: మంద కృష్ణమాదిగ పద్మశ్రీ అవార్డు అందుకుని ఢిల్లీ నుంచి ఈనెల 31న వరంగల్‌కు వస్తున్నందున స్వాగతం పలికేందుకు నిర్వహించ తలపెట్టిన చలో వరంగల్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి, ములుగు జిల్లా ఇన్‌చార్జ్ దుడ్డు రామకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతి ముర్ము నుంచి పద్మశ్రీ అవార్డు అందుకుని వరంగల్‌కు వస్తున్న మంద కృష్ణకు స్వాగతం పలకడంతో పాటు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మాదిగ, మాదిగ ఉపకుల సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు, పుల్లూరి కరుణాకర్, చెన్నం స్వామి, సమ్మయ్య, ప్రశాంత్, సర్వేశ్, నాని, రాము తదితరులు పాల్గొన్నారు.

కోటను సందర్శించిన మాల్దీవ్స్ దేశస్తులు



ఖిలా వరంగల్: కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటను బుధవారం మాల్దీవ్స్ దేశస్తులు సందర్శించారు. నాలుగు కీర్తితోరణాల నడుమ నల్ల రాతిలో నాటి శిల్పులు చెక్కిన శిల్ప కళ సంపదను తిలకించారు. అనంతరం రాతి, మట్టికోట అందాలు, ఖుష్‌మహల్‌ను సందర్శించి కాకతీయుల కళాఖండాలను తమ వెంట తెచ్చుకున్న కెమెరాలలో బంధించుకున్నారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను కోట గైడ్ రవి వివరించారు. వారివెంట కేంద్రపురావస్తుశాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్, టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ అజయ్ పాల్గొన్నారు.

నిట్‌లో టెమ్ ఎక్స్‌పో

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని సీఆర్ఐఎఫ్ (సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ) భవనంలో బుధవారం ఏర్పాటుచేసిన టెమ్ (ట్రాన్స్‌మిషన్ ఎల్రక్టాన్ మైక్రోస్కోపీ) స్పెసిమెన్ ప్రిపరేషన్ పరికరాల ఎక్స్‌పోను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ప్రారంభించి మాట్లాడారు. నానో టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలకు వేదికగా ఎక్స్‌పో నిలవాలని ఆకాంక్షించారు. నిట్‌తోపాటు వివిధ విద్యాసంస్థల విద్యార్థులకు, పరిశోధకులకు, శాస్త్రవేత్తలకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో డీన్ అకాడమీ శరత్‌బాబు, ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం

జిల్లాలో ముందస్తుగా కురుస్తున్న వర్షాలు

- పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్న రైతులు
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు
- 'నకిలీ' కట్టడికి టాస్క్‌ఫోర్స్ బృందాలు



దుక్కి దున్నుతున్న రైతు

భూపాలపల్లి: అన్నదాతలు సాగుకు సమాయత్తం అవుతున్నారు. జిల్లాలో ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో విత్తనాల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. మరో వారం రోజులు వానలు పడితే పత్తి గింజలు నాటనున్నారు. ఇప్పటికే పలువురు రైతులు దుక్కులను సిద్ధం చేసుకోగా మరికొందరు వానలు ఆగగానే దున్నేందుకు రెడీగా ఉన్నారు.

2,10,524 ఎకరాల్లో సాగు అంచనా..

జిల్లాలో గతేడాది 2,02,687 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేయగా ఈ ఏడాది వానాకాలంలో 2,10,524 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది పత్తి, వరి పంటల వైపే రైతులు మొగ్గు చూపనున్నారు. వానాకాలంలో మొక్కజొన్న, పెసర, కంది, మినుము, వేరుశనగ తదితర పంటలను అంతంత మాత్రంగానే సాగు చేయనున్నారు.

ముందస్తు వర్షాలు..

జిల్లావ్యాప్తంగా ఈ నెల 18వ తేదీన 8.2 మి.మీ., 20న 12.6 మి.మీ., 21న 89.0 మి.మీ., 23న 78.2 మి.మీ., 24న 15.4 మి.మీ., 26న 9.8 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. అయితే ఈ నెలలో కురిసిన వర్షాలతో భూములు అంతంత మాత్రంగానే తడిసాయి. పత్తి విత్తనాలు విత్తేందుకు అనుకూలం కాకపోవడంతో వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మళ్లీ వర్షాలు కురిస్తే జూన్ తొలివారంలో పత్తి గింజలు నాటనున్నారు.

నకిలీ విత్తనాల భయం..

గతంలో జిల్లా సరిహద్దులోని మహారాష్ట్ర నుంచి కొందరు వ్యక్తులు కాటారం డివిజన్ పరిధిలోకి వచ్చి లూజ్, బీజీ 3 పేరిట విత్తనాలు విక్రయించేవారు. బీజీ 3 విత్తనాలు నిషేధించినప్పటికీ పలుచోట్ల విక్రయాలు, కొనుగోళ్లు జరిగి రైతులు మోసపోయారు. ఈ ఏడాది అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. వ్యయసాయ, పోలీసు, రెవెన్యూశాఖ అధికారులతో కలిసి ఐదు టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేశారు.

సాగుకు అవసరమైన ఎరువులు

యూరియా	10,500 మెట్రిక్ టన్నులు
డీఏపీ	5,544 టన్నులు
కాంప్లెక్స్	5,544 టన్నులు
పొటాష్	2,772 టన్నులు

ప్రధాన పంటల సాగు అంచనా (ఎకరాల్లో)..

వరి	1,12,218
పత్తి	93,823

పత్తి గింజలు కొనుగోలు చేశా..



నాకున్న 15 ఎకరాల్లో గతేడాది వానాకాలంలో వరి, పసుపు, మిర్చి, పత్తి సాగు చేశా. పసుపు మినహా అన్ని పంటల్లో నష్టాలే వచ్చాయి. అయినా ఈ ఏడాది ఆశతో ఇప్పటికే మూడెకరాల దుక్కి పాతం చేసిన. అంతలోనే వర్షం పడుతుంది. వర్షం ఆగగానే మిగిలిన భూమి మొత్తం పాతం చేపిస్తా. ఏడెకరాల్లో పత్తి వేద్దామని బీజీ 2 రకం విత్తనాలు కొనుగోలు చేశా. విత్తనాలకు కొరత లేదు. జూన్ మొదటి వారంలో వర్షాలు కురిస్తే పత్తి గింజలు నాటుత.

- మాధన మునీందర్, రైతు, గర్మిళ్లపల్లి, టేకుమట్ల

మిర్చి ధర లేదు..



గతేడాది రెండెకరాల్లో మిర్చి, ఒక ఎకరంలో పత్తి సాగు చేసిన. మిర్చి దిగుబడి వచ్చినా ధర లేదు. ఈ ఏడాది మూడెకరాల్లో పత్తి సాగు చేద్దామనుకుంటున్న. విత్తనాలు సరిపడా అందుబాటులో ఉన్నాయి. రెండు రోజుల క్రితమే కొనుచేశా. వర్షం తగ్గగానే దుక్కులు సిద్ధం చేసి పత్తి గింజలు పెడుత.

- రఘుసాల మహేందర్, రైతు, కొత్తపల్లిగోరి

ఇప్పుడే నాటొద్దు..



జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షం పత్తి విత్తనాలు నాటేందుకు అనుకూలం కాదు. భూమిలో కనీసం నాగలి సాలు లోతు తడి ఉండాలి. అప్పుడే పత్తి విత్తనాలను నాటుకోవాలి. బీజీ 3, లూజ్ విత్తనాలను ఎవరూ కొనుగోలు చేయొద్దు. లైసెన్స్ కలిగిన సీడ్స్ షాపుల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలి. బిల్లులను తప్పనిసరిగా తీసుకొని భద్రంగా ఉంచాలి.

- వీరునాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

సమన్వయంతో పుష్కరాలు విజయవంతం

కలెక్టర్ రాహుల్‌శర్మ



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలు అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం అయ్యాయని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. సరస్వతీ పుష్కరాలు విజయవంతంపై బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పుష్కరాలకు 30 లక్షల మందికి పైగా భక్తులు వచ్చారని, ఏర్పాట్లపై నిరంతరం ప్రభుత్వ మార్గదర్శనం మేరకు సమీక్షలు నిర్వహించి దిశానిర్దేశం చేశామన్నారు. సరస్వతీ మాతా విగ్రహం ఏర్పాటు చేసి, ప్రతీ రోజు కాశీపండితులచే నవరత్న మాల హారతి నిర్వహించామన్నారు. టెంట్ సిటీ ఏర్పాటు ద్వారా 40 రూములు, 200 డార్మెటరీ, ఫుడ్ కోర్టు, కిడ్స్ ప్లే జోన్, వాహన పార్కింగ్ ఏర్పాట్లతో సౌకర్యాలు కల్పించామన్నారు. వర్షంతో అవాంతరాలు వచ్చినా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చేశామన్నారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు మజ్జిగ, మంచినీరు సరఫరా చేయడంతో పాటు క్యూలో ఉన్న భక్తుల సౌకర్యార్థం కూలర్లు ఏర్పాటు చేశామన్నారు. పుష్కరాల నిర్వహణ సంతృప్తిని ఇచ్చినట్లు తెలిపారు.

ఇదొక మంచి అనుభవం..

సరస్వతీ నది పుష్కరాలు మంచి అనుభవంగా ఉపయోగపడుతుందని ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. కాళేశ్వరం చిన్న గ్రామమని లక్షల్లో భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశామన్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతమని, చాలా ప్రామాణికంగా తీసుకుని బందోబస్తు నిర్వహించామన్నారు. అధిక ఉష్ణోగ్రతలు, వర్షంతో ఇబ్బందులు వచ్చినా 24 గంటలు పనిచేశామన్నారు. పుష్కరాలకు మీడియా విస్తృత ప్రచారం కల్పించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పీ బోనాల కిషన్, కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, డీపీఆర్‌ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

- అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

మల్హర్: ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్య పడొద్దని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొయ్యూరు, వల్లెకుంట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సెంటర్ల వారీగా ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం వివరాలు, నిల్వ ఉన్న ధాన్యం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హమాలీల కొరత లేకుండా, కొనుగోళ్ల వేగం పెంచి రెండు, మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి, మిల్లులకు తరలించాలని ఆదేశించారు. మండలానికి కేటాయించిన మిల్లుల టార్గెట్ పూర్తయితే పెద్దపల్లి జిల్లాలోని మిల్లులకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ శ్రీనాథ్, నిర్వాహకుల ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గండ్ర



వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ తమ కుటుంబ సభ్యులతో బుధవారం దర్శించుకున్నారు. అధికారులు సంప్రదాయబద్ధంగా వారికి స్వాగతం పలికారు. ప్రధానాలయంలోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదాలను అందించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



వ్యాన్‌లో తరలిస్తున్న పశువులు

కాటారం: కాటారం మండల కేంద్రం మీదుగా హైదరాబాద్‌కు అక్రమంగా వాహనంలో తరలిస్తున్న పశువులను బుధవారం కాటారం పోలీసులు పట్టుకున్నారు. ప్రొబిషనరి ఎస్సై గీతారాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పశువుల అక్రమ రవాణా జరుగుతుందనే పక్కా సమాచారం మేరకు కాటారం–మంథని ప్రధాన రహదారిపై పోలీసులు, పశువైద్యాధికారి ధీరజ్ సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఇదే క్రమంలో మంథని వైపుగా వెళ్తున్న కంటైనర్ వ్యాన్‌ను పరిశీలించగా అందులో పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఏడు ఎద్దులు, 23 కోడె లేగలతో కూడిన వ్యా న్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాటారం మండలం ఇబ్రహీంపల్లికి చెందిన సయ్యద్ ఖయ్యూబ్, అఫ్రోజ్, పోతుల్వాయికి చెందిన పిట్టల అనిల్, సిద్దిపేటకు చెందిన వ్యాన్ డ్రైవర్ షరీఫ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మహాముత్తారం మండలం రెడ్డిపల్లికి చెందిన హరిబాబు వద్ద పశువులను అక్రమంగా కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు నిందితులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. పశువైద్యాధికారి డాక్టర్ ధీరజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గీతారాథోడ్ తెలిపారు. కాగా జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కుమారస్వామి ఆధ్వర్యంలో పశువులను రాంపూర్ గోశాలకు తరలించారు.

2న యువ వికాసం ప్రొసీడింగ్స్ ఇవ్వాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

భూపాలపల్లి అర్బన్: జూన్ 2వ తేదీన నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ సీఎం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టర్ రాహుల్‌శర్మ పాల్గొన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు సంబంధించి చేపట్టిన చర్యలను అధికారులకు వివరించారు. ఈ వీసీలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి క్రాంతికిరణ్, ఎస్సీ అభివృద్ధి అధికారిణి సునీత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు రూరల్: జిల్లాలోని మినీ గురుకులాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ హరిసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ములుగు మండలంలోని జాకారం, ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని పోచాపూర్, వాజేడు మండలంలోని మినీ గురుకులాల్లో 1వ తరగతిలో చేరేందుకు విద్యార్థులకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మూడు గురుకుల పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ఒక్కో పాఠశాలలో గిరిజన బాలికలకు 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. జాకారం మినీ గురుకులంలో రెండో తరగతిలో 12 సీట్లు, మూడో తరగతిలో 3 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. పోచాపూర్ గురుకుల పాఠశాలలో రెండో తరగతిలో 5 సీట్లు, నాల్గో తరగతిలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వాజేడు మినీ గురుకులంలో రెండో తరగతిలో 15 సీట్లు, నాల్గో తరగతిలో 1 సీటు ఖాళీగా ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన గిరిజన బాలికల తల్లితండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేటి నుంచి జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తులు పాఠశాలల్లో స్వీకరించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తులు దారులు విద్యార్థి ఆధార్‌కార్డు, ఫొటో, రేషన్‌కార్డు, కులం సర్టిఫికెట్లతో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ

ములుగు: ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీడబ్ల్యూజేఏ) రెండో రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను బుధవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఎలాంటి సమస్యలు లేకుండా సభను విజయవంతం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు సీతక్కకు ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రవిచందర్, టీడబ్ల్యూజేఏ జిల్లా అధ్యక్షుడు వెంకన్న, గౌరవ అధ్యక్షుడు భూక్య సునీల్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఎండీ షఫీ అహ్మద్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సన్నద్ధం

జిల్లాలో 18.82 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

- అందుబాటులో 32.99లక్షల మొక్కలు
- ఎండల నుంచి రక్షణకు గ్రీన్ షేడ్‌నెట్ ఏర్పాటు
- ప్రతీ నర్సరీకి వన సేవక్‌ల ఏర్పాటు



ఆజాంనగర్ నర్సరీ

భూపాలపల్లి రూరల్: జిల్లాలో వన మహోత్సవం నిర్వహణకు అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 241 నర్సరీల్లో మొక్కల పెంపకం ప్రక్రియ గతేడాది అక్టోబర్ నుంచే ప్రారంభించారు. ప్రత్యేకంగా తయారు చేసిన విత్తనాలు నాటి మొక్కలను సంరక్షిస్తున్నారు. నర్సరీల్లో ఈ ఏడాది పూలమొక్కలు, నీడనిచ్చే తదితర జాతులకు చెందిన 18.82 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగా డీఆర్‌డీఏ 17 లక్షలు, ఫారెస్టు శాఖ 51వేలు, సింగరేణి 1.31 లక్షల మొక్కలను కేటాయించారు. ఇందులో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 29,81,400, ఫారెస్టు ఆధ్వర్యంలో 1,51,000, సింగరేణి ఆధ్వర్యంలో 1,67,000 మొత్తం 32,99,400 పెంచిన మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. గత సంవత్సము నాటిన మొక్కలు ఎదగక ముందు చనిపోతే వాటి స్థానంలో మళ్లీ నాటాలని నిర్ణయించారు. ప్రభుత్వ కార్యాలయాలు, బంజరు భూములు, కాలువలు, చెరువుగట్లు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటుతారు. గ్రామ పంచాయతీల్లో ఉన్న నర్సరీలు, ఇతర ప్రాంతాల్లోని నర్సరీల్లో మొక్కల సంరక్షణకు వన సేవక్‌లను నియమించారు. మొక్కలు చనిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీరందిస్తున్నారు. ప్రతీ పదిహేను రోజులకోసారి కలుపు తీసి ఎరువులు వేస్తున్నారు. చనిపోయిన, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తగా విత్తనాలు, మొక్కలు నాటుతున్నారు. ఎండ వేడికి మొక్కలు చనిపోకుండా ప్రతీ నర్సరీలో గ్రీన్‌షేడ్‌నెట్ (నీడ పరదాలు) ఏర్పాటు చేశారు. జూన్ నెలలో ప్రభుత్వం నిర్వహించే వన మహోత్సవంలో మొక్కలు నాటనున్నారు.

భారీ వృక్షజాతుల మొక్కలు..



భారీ వృక్ష జాతుల మొక్కల పెంపకం ఈ ఏడాది నుంచి చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. సుమారుగా 7.63 లక్షల మొక్కలను దాదాపు 2.5 మీటర్ల ఎత్తు పెంచడానికి నర్సరీల్లో చర్యలు తీసుకుంటున్నారు. భారీ వృక్షజాతులుగా పిలిచే గుల్మోహార్, నిద్రగన్నేరు, కానుగ, సుబాబుల్, చైనా బాదం, తబోబియా, నల్లమద్ది, గీత కార్మికుల కోసం ఈత, తాటి మొక్కలు పెంచుతున్నారు. ఏడాది పాటు నర్సరీల్లో పెరిగితే దాదాపు రెండు మీటర్ల నుంచి 2.5 మీటర్ల ఉంటాయి. ఆ మొక్కలను ప్రభుత్వ స్థలాలు, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నాటితే నీడతో పాటు, ఆహ్లాదంగా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. భారీగా మొక్కల ను నాటేందుకు ఏర్పాట్లు చేయనున్నారు.

మండలాల వారీగా పెంచిన మొక్కలు (లక్షల్లో)

భూపాలపల్లి	2.98
చిట్యాల	3.09
గణపురం	2.09
కాటారం	2.98
మహదేవ్‌పూర్	2.23
మహముత్తారం	2.96
మల్హర్	1.85
మొగుళ్లపల్లి	3.09
పలిమెల	0.98
రేగొండ	4.58
టేకుమట్ల	2.98
ఫారెస్టుశాఖ	0.51
సింగరేణి	1.31

ఇంటి ఆవరణలో మొక్కలు నాటుకోవాలి

వన మహోత్సవంలో భాగంగా పంపిణీ చేసే పండ్ల మొక్కలు, పూలమొక్కలు, నీడనిచ్చే మొక్కలు ప్రతీ ఇంటి ఆవరణలో నాటుకోవాలి. ఈ సంవత్సరం జూన్, జూలై మాసాల్లో వన మహోత్సవం పూర్తి చేయాలనుకుంటున్నాం. గ్రామాలు, పట్టణాల్లో పచ్చదనం పెరిగేలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలి. ఎండ నుంచి రక్షణ కోసం గ్రీన్ పరదాలను ఏర్పాటు చేశాం. మొక్కలు చనిపోకుండా ఎరువులు వేసి కాపాడుతున్నారు.

- బాలకృష్ణ, డీఆర్‌డీఓ

క్రైం ఏసీపీగా సదయ్య



హసన్‌పర్తి: వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం ఏసీపీగా సదయ్య నియమితులయ్యారు. సీఐడీ విభాగంలో పనిచేసిన సదయ్య బదిలీపై ఇక్కడికిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలోని ఆత్మకూర్‌లో ఎస్సైగా, కేయూసీ, సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

- ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ మండలాల్లో గల గిరిజన యువతీయువకులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు అర్హత కలిగిన కంపెనీలు, ఏజెన్సీలు వారి ప్రతిపాదనలను జూన్ 10వ తేదీలోపు పంపించాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులు హోటల్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ అసిస్టెంట్, డాటా ఎంట్రీ ఆపరేటర్, సోలార్ టెక్నీషియన్, లాజిస్టిక్స్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. శిక్షణ ఇచ్చే సంస్థలకు కనీసం ఐదేళ్లు స్కిల్ డెవలప్‌మెంట్‌లో అర్హత కలిగి ఉండాలని, ప్రభుత్వ శాఖలలో శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించి ఉండాలని సూచించారు. ఉపాధి అవకాశాలు హనుమకొండ, హైదరాబాద్‌లో నూరుశాతం కల్పించాలని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన సంస్థ నుంచి మాత్రమే సర్టిఫికెట్ జారీ చేయాలని, పైన తెలుపబడిన అర్హతలు కలిగి ఉన్న శిక్షణ సంస్థలు సీల్డ్ కవర్లలో ప్రతిపాదనలు ఐటీడీఏకు పంపించాలని కోరారు.

క్లుప్తంగా

స్టార్టర్ మరమ్మతు చేస్తుండగా..

- విద్యుత్‌షాక్ తగిలి రైతు మృతి
- కాల్ నాయక్ తండాలో ఘటన

నర్సంపేట: వ్యవసాయ మోటారు స్టార్టర్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్ తలిగి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కాల్‌నాయక్ తండాలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, తండావాసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుగులోత్ భద్రు(48) మంగళవారం మధ్యాహ్నం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. నీరు పారించడానికి యత్నించగా మోటారు నడవకపోవడంతో స్టార్టర్ మరమ్మతు చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్‌షాక్ తగిలి పక్కనే ఉన్న వ్యవసాయబావిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు బావిలో నుంచి భద్రు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుమారుడు విజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన


కార్తీక్ మృతదేహం

మహబూబాబాద్ రూరల్: అనుమానాస్పద స్థితిలో ఆర్మీ ఉద్యోగం కోసం శిక్షణ తీసుకుంటున్న ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ఉప్పల సింగారం కాలనీకి చెందిన పెండెం రాజేశ్వరరావు కుమారుడు కార్తీక్ (17) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డీవీ నాయక్ డిఫెన్స్ అకాడమీలో ఆర్మీ ఉద్యోగం కోసం శిక్షణ తీసుకుంటున్నాడు. నెల రోజుల క్రితం వచ్చిన కార్తీక్.. అకాడమీలోనే ఉంటూ శిక్షణ పొందుతున్నాడు. బుధవారం రాత్రి బహిర్భూమికని తరగతి గది నుంచి బయటకు వచ్చిన కార్తీక్.. కోచింగ్ సెంటర్ భవనంపైకి ఎక్కి తన లోయర్ (ప్యాంట్) తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో అక్కడ సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై అక్కడే పడ్డాడు. వెంటనే కోచింగ్ సెంటర్ నిర్వాహకులు చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు కార్తీక్ అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా, కార్తీక్ విద్యుత్ వైర్లు పట్టుకోవడంతోనే షాక్‌కు గురై మృతిచెంది ఉంటాడనే అనుమానం వ్యక్తమవుతోంది. టౌన్ ఎస్సై అలీమ్ హుస్సేన్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు.

అక్రమార్కులపై చర్యలేవి..?

టీజీఎన్పీడీసీఎల్‌లో సబ్ ఇంజనీర్ల నియామకాల్లో అక్రమాలు | విచారణలో వెలుగు చూసిన వాస్తవాలు

- విచారణ ముగిసి మూడు నెలలైనా బాధ్యులపై చర్యలు శూన్యం
- యాజమాన్యం వెనుకడుగు వెనుక ఉన్న ఒత్తిళ్లేమిటి..?


టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ : తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీజీ ఎన్పీడీసీఎల్) లో చేపట్టిన సబ్ ఇంజనీర్ల రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు జరిగినట్లు వాస్తవాలు వెలుగుచూశాయి. అయితే దీనిపై యాజమాన్యం బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉపేక్షిస్తోంది. ఫలితంగా సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంపెనీ తీరుపై అనేక సందేహాలు నెలకొంటున్నాయి. అక్రమాలు జరిగినట్లు మూడు నెలల క్రితమే నిజాలు నిగ్గు తేలగా ఇప్పటి వరకూ బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వారిని కాపాడడంలో ఉన్న ఆంతర్యమేమిటని విద్యుత్ ఉద్యోగ వర్గాలతో పాటు నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

హైకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులు..

ఎన్నిక కోడ్ ఎత్తివేశాక 2018 డిసెంబర్‌లో పూర్వ సర్కిళ్ల వారీగా మరోసారి సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలని కాల్ లెటర్ పంపారు. అయితే ఈ సమయంలో మరో 24 పోస్టులు తగ్గించారు. గతంలో కాల్ లెటర్ అందుకుని రెండోసారి కాల్‌లెటర్ అందని అభ్యర్థులు వెంటనే హైకోర్టును ఆశ్రయించగా అంతకు ముందు కాల్‌లెటర్ జారీ చేసిన వారందరికీ తిరిగి జారీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు అధికారులు అనర్హులతో కలిపి 427 మందికి కాల్‌లెటర్ పంపి పోస్టులు భర్తీ చేశారు.. అయితే ఇక్కడ కోర్టు ఆదేశాలతో కాల్ లెటర్ పొందిన 24 మంది అభ్యర్థులను పక్కన పెట్టారు. ఇక్కడే అక్రమాలకు బీజం పడింది. కాల్ లెటర్ అందుకుని ఉద్యోగాలు రాని అభ్యర్థులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో ఫిర్యాదు చేశారు. దీంతో టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం విచారణ చేపట్టింది. టీజీ పీఎస్‌సీ నుంచి ఒక అధికారి, టీఎస్ ఎస్పీడీసీఎల్ నుంచి ఇద్దరు, టీజీ ఎన్పీడీసీఎల్ నుంచి ఇద్దరు అధికారులతో కూడిన కమిటీ పూర్తి స్థాయిలో విచారణ జరిపి 24 పోస్టుల భర్తీలో అక్రమాలకు జరిగినట్లు గుర్తించారు. అర్హులు కాని వారు ఉద్యోగాలు పొందినట్లు గుర్తించి విచారణ కమిటీ యాజమాన్యానికి నివేదిక అందించింది. ఈ నివేదిక మేరకు అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారికి నోటీసు జారీ చేయగా వారు కోర్టుకు వెళ్లారు. కోర్టు వీరికి అనుకూలంగా నిర్ణయం వెల్లడించడంతో వారు ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. అన్యాయం జరిగిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవాల్సి ఉన్నా ఇప్పటి వరకు యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

కీలక పోస్టుల్లో ఏళ్ల తరబడి ఒకే అధికారి తిష్ట

టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఉద్యోగ నియామక ప్రక్రియను ఇండస్ట్రియల్ విభాగం నిర్వహిస్తుంది. ఈ విభాగంలో కంపెనీ ఏర్పాటు నుంచి కీలక పోస్టులో ఒకే అధికారి ఏళ్ల తరబడి పని చేస్తున్నారు. ఈ అధికారిపై అనేక ఆరోపణలున్నాయి. అక్రమాలకు పాల్పడడంలో ఆయనది అందెవేసిన చేయి అని ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. ఏళ్లుగా ఒకే పోస్టులో పని చేస్తుండడంతో ఏ సమయంలో ఎలా అక్రమాలకు పాల్పడొచ్చో ఆయనకు సంపూర్ణ అవగాహన ఉందని సమాచారం. దీంతో సబ్ ఇంజనీర్ల నియామకాల్లో అక్రమాలకు తెరలేపారని ఉద్యోగవర్గాలు పేర్కొన్నాయి.

497 సబ్ ఇంజనీర్ల పోస్టుల భర్తీకి 2018లో నోటిఫికేషన్..

టీజీ ఎన్పీడీసీఎల్‌లో 497 సబ్ ఇంజనీర్ల పోస్టుల భర్తీకి 2018, మే 24న నోటిఫికేషన్ జారీ చేశారు. అదే ఏడాది జూలై 8న రాత పరీక్ష నిర్వహించారు. ఆగష్టు 31న ఫలితాలు ప్రకటించారు. పోస్టుకు ఒక్కరు చొప్పున మెరిట్ ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సెప్టెంబర్‌లో పూర్వ సర్కిల్ వారీగా వేర్వేరు తేదీల్లో కాల్ లెటర్ పంపించారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు 497 మందికి కాకుండా 427 మందికి మాత్రమే కాల్ లెటర్ పంపారు. అంటే ఇక్కడ 70 పోస్టులు తగ్గించారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా నియామక ప్రక్రియ నిలిపేశారు.

అక్రమార్కులపై చర్య తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటి?

ఇంజనీర్ల నియామకాల్లో అక్రమాలు వెలుగు చూసినా ఎలాంటి చర్య తీసుకోకపోవడంలో ఉన్న ఆంతర్యమేమిటని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. కింది స్థాయి ఉద్యోగులు చిన్న తప్పులు చేస్తే చర్యలు తీసుకునే యాజమాన్యం.. ఇంత పెద్ద అక్రమం జరిగినా ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తుందని ప్రశ్నలు సంధిస్తున్నారు. ఇలాగైతే భవిష్యత్‌లో చేపట్టనున్న నియామకాలు పారదర్శకంగా జరుగుతాయా అనే సందేహాలు నిరుద్యోగుల్లో వ్యక్తమవుతున్నాయి. అక్రమాలకు పాల్పడింది ఇండస్ట్రియల్ విభాగం అధికారులేనని స్పష్టంగా కనిపిస్తున్నా చర్యలకు వెనుకంజ వేయడంపై యాజమాన్యం తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఉద్యోగుల తోపాటు నిరుద్యోగులు కోరుతున్నారు.

ట్రంప్ విధానాలతో విద్యార్థులకు తీవ్ర నష్టం

- ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్



మాట్లాడుతున్న మద్దికాయల అశోక్

వరంగల్ చౌరస్తా : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలతో వర్తమాన దేశాలకు, విదేశీ ఉన్నత విద్యనభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ విమర్శించారు. బుధవారం మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఇండియా(ఐక్య) పొలిట్ బ్యూరో సమావేశాల అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రంప్ కొన్ని దేశాలపై కక్ష కట్టి భారీ పన్నులను విధిస్తూ అమెరికాలో చదువుకునే భారతీయ, ఇతర దేశాల విద్యార్థులపై అనేక ఆంక్షలు విధిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నార న్నారు. ఈ విధానాలను వ్యతిరేకించాల్సిన భారత ప్రభుత్వం అందుకు విరుద్ధంగా మోకరిల్లి దేశానికి తీరని నష్టం చేకూరుస్తోందని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిరణ్ జిత్ సింగ్ శేఖన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, పొలిట్ బ్యూరో సభ్యుడు మహేంద్ర నేహ, అనుభవ్ దాస్ శాస్త్రి, కాటం నాగభూషణం, వల్లెపు ఉపేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలపాలి

ఖిలా వరంగల్: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై రాజ్యహింస, మావోయిస్టుల ఏరివేత పేరుతో పౌరులపై కొనసాగిస్తున్న కాల్పివేతను వెంటనే నిలపాలని ఎంసీపీఐ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు మర్రెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని సాయి ఫంక్షన్ హాల్‌లో ఎంసీపీఐ కేంద్ర నాయకుడు మోర్తాల చందర్ రావు ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరిగిన పార్టీ రాష్ట్ర ప్రథమ మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ ముగింపు సమావేశానికి వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టి మావోయిస్టుల ఏరివేత పేరుతో కాల్చి చంపి వారి మృతదేహాలను కూడా కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండపడ్డారు. ఇప్పటికైనా ఆపరేషన్ కగార్ నిలిపి మావోయిస్టులను శాంతి చర్చలకు ఆహ్వానించి పౌర హక్కులను కాపాడాలన్నారు. సమావేశంలో నాయకులు నర్ల చంద్రశేఖర్, పానుగంటి నరసయ్య, మాదం తిరుపతి, మాడిశెట్టి అరుణ్ కుమార్, తాటికొండ రవి, మాలోత్ రాజేశ్ నాయక్, సంద గణేశ్, బాషిపాక రమేశ్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు

నేటినుంచి స్పాట్ వాల్యుయేషన్

- క్యాంప్‌నకు లక్షా 40వేల జవాబుపత్రాల కేటాయింపు

విద్యారణ్యపురి: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ కోర్సుల అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ముగిశాయి. హనుమకొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ (కోఎడ్యుకేషన్)లో ఈనెల 29 నుంచి మొదటి దశ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం కానుంది. ఈక్యాంపునకు లక్షా 40వేల వరకు జవాబుపత్రాలు కేటాయించారు. ఈనెల 29నుంచి సంస్కృతం, ఇంగ్లిష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్, సబ్జెక్టుల పరీక్షల ప్రథమ, ద్వితీయ జవాబుపత్రాల వాల్యుయేషన్ నిర్వహించనున్నామని క్యాంపు ఆఫీసర్, హనుమకొండ డీఐఈఓ ఎ. గోపాల్ తెలిపారు. సీఈలుగా, ఏఈలుగా నియామకమైన అధ్యాపకులు ఈనెల 29న ఉదయం క్యాంప్‌లో రిపోర్టు చేయాల్సింటుంది. ఈనెల 31నుంచి రెండోదశలో బాటనీ, జూవాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, హిస్టరీ ఫిజిక్స్, ఎకనామిక్స్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జవాబుపత్రాలు వాల్యుయేషన్ నిర్వహిస్తారు.

పుష్కరాల ఆదాయం రూ. 2.83 కోట్లు


కాళేశ్వరాలయంలో నగదు లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు జరిగిన సరస్వతీనది పుష్కరాల సందర్భంగా భక్తులు హుండీల్లో వేసిన నగదు కానుకలు, లడ్డు ప్రసాదం, రూమ్‌ల అద్దెలు, హోమాలు, దర్శనాల ద్వారా కాళేశ్వరాలయానికి రూ. 2.83కోట్ల ఆదాయం సమకూరినట్లు ఈఓ శనిగెల మహేశ్ తెలిపారు. బుధవారం శ్రీకాళేశ్వరముక్తీశ్వర స్వామి ఆలయ హుండీలను లెక్కించారు. పుష్కరాలు 12 రోజులతో సహా మొత్తం 64 రోజులకు గాను హుండీల ద్వారా రూ.1,36,28,099 కోట్లు, దేవస్థానం అద్దె గదుల ద్వారా రూ.1.71లక్షలు, హోమాల ద్వారా రూ.1.23లక్షలు, శీఘ్రదర్శనం ద్వారా రూ.5.60.లక్షలు, ప్రసాదం ద్వారా రూ.1,38,36,552 కోట్లు, మొత్తం రూ. 2,83,18,651 ఆదాయం వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. మిశ్రమ బంగారం 15 గ్రాములు, మిశ్రమ వెండి 1.750 గ్రాములు సమకూరిందని తెలిపారు. వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ సునీత, పర్యవేక్షణాధికారి నందనం కవిత ఆధ్వర్యంలో హుండీ నగదు లెక్కించారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, పుష్కరాల ఉత్సవ కమిటీ సభ్యులు మోహన్‌శర్మ, సత్యనారాయణ, సత్యం, శ్యాందేవుడా, సత్యనారాయణ, సీతయ్య, ప్రశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రంగస్థల నటుడు శ్యామలరావు కన్నుమూత


శ్యామలరావు(ఫైల్)

హన్మకొండ కల్చరల్ : రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగు నాటక రంగంలో దర్శకుడిగా, నటుడిగా ఖ్యాతి గడించిన శతపతి శ్యామలరావు (66) కన్నుమూశారు. వరంగల్ రైల్వేగేట్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన శతపతి శ్యామలరావుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆయనకు భార్య కిడ్నీ దానం చేశారు. కిడ్నీ శరీరానికి సరికాకపోవడంతో అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఏటా రంగలీలా మైదానంలో నిర్వహించే రావణవధ కార్యక్రమంలో వ్యాఖ్యాతగా వ్యవహరించేవారు. నరకాసురవధ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. గత ఆదివారం ప్రముఖ రంగస్థల కళాకారుడు జీవీ బాబు మరణించడం.. బుధవారం మరో రంగస్థల సీనియర్ కళాకారుడు శతపతి శ్యామలరావు మృతి చెందడంతో ఓరుగల్లు రంగస్థల కళాకారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల అధ్యక్షుడు ఆకుల సదానందం, ఐక్యవేదిక బాధ్యులు కాజీపేట తిరుమలయ్య, ఎన్ఎస్ఆర్ మూర్తి, సీనియర్ కళాకారుడు జేఎస్ శర్మ, జూలూరు నాగరాజు, సహృదయ సాహిత్య సాంస్కృతిక బాధ్యులు, తదితరులు సంతాపం తెలిపారు.

మట్టికి ఆరోగ్య పరీక్షలు..

భూసారంతో అధిక దిగుబడులు

- ఎరువుల వాడకంలో ఖర్చులు తగ్గుదల
- సూక్ష్మ పోషకాల పరిమాణాన్ని తెలుసుకోవచ్చు
- మట్టి నమూనాను సేకరించే పద్ధతి ప్రదర్శన
- రైతులకు అవగాహన సదస్సులు


ధర్మసాగర్ మండలం మలక్‌పల్లిలో రైతుల నుంచి మట్టి సేకరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త రాజు (ఫైల్)


ఖిలా వరంగల్: ఖరీఫ్‌లో రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవడానికి ఇది అనువైన సమయం. ప్రతీ ఏడాది భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రైతులకు ఈ అంశంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ రాజన్న తెలిపారు.

భూమిలో ప్రధానంగా 17 నుంచి 18 పోషకాలు..

మట్టి (భూసార) పరీక్షలతో నేల ఆరోగ్యం కాపాడినట్లు అవుతుందని, భూమిలో ప్రధానంగా 17 నుంచి 18 పోషకాలు ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మట్టిలో నైట్రోజన్, పాస్పరస్ ముఖ్యమైన పోషకాలు. తర్వాత కార్బన్ హైడ్రోజన్ ఆక్సిజన్(సీహెచ్ఓ) మైక్రోన్యూట్రిన్స్ (లఘు పోషకాలు) ప్రధానమని, ఇవన్నీ ఉంటే పంటల దిగుబడి అధికంగా వస్తుందని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు వెల్లడించారు. భూమిలో సహజ పోషకాలున్నా రైతులు అధిక దిగుబడులు కోసం ఇష్టారాజ్యంగా రసాయన ఎరువులు వాడడం వల్ల కొన్ని రోజులకు భూమి చౌడుగా మారి వినియోగంలోకి రాకుండా పోతుందని తెలిపారు.

మట్టిని ఎలా సేకరించాలి..

ఏటవాలు పొలంలో వర్షపు నీరు ప్రవహించి పోషకాలు ఒకే దగ్గరికి చేరుతాయి. ఈనేపథ్యంలో రైతులు ఎకరం పొలంలో 8 నుంచి 10 ప్రదేశాల్లో మట్టిని సేకరించాలి. వీ ఆకారంలో 15సెం. వరకు పారతో గుంతతీసి, అందులో పైపార ఇంచు లోతుకు తవ్వి మట్టి తీయాలి. తడిలేకుండా ఆరబెట్టాలి. చతురాస్త్రా ఆకారంలో నాలుగు విభాగాలు చేయాలి. ఎదురెదురుగా ఉన్న మన్ను మాత్రమే తీసుకోవాలి. మిగతా రెండు భాగాలను తొలగించాలి. ఇలా కిలో మట్టి వచ్చే వరకు చేయాలి. ఇలా సేకరించిన మట్టిలో రాళ్లు, పంట వేర్ల మొదళ్లు లేకుండా చూసుకుని నీడలో ఆరనివ్వాలి. నమూనా కోసం పొలంలో మట్టిని తవ్వి సేకరించే సమయంలో గట్ల దగ్గర, పంట కాల్వలోని మట్టి తీసుకోవద్దు. చెట్ల కింద ఉన్న పొలం భాగం నుంచి మట్టిని సేకరించొద్దు. ఆ తర్వాత ఆ మట్టిని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం, ములుగు రోడ్డులోని వ్యవసాయ పరిశోధన భూసార పరీక్ష కేంద్రానికి తరలించాలి. నిపుణులు సర్వే నంబర్‌తో నమోదు చేసుకుని ప్రయోగశాలలో పరీక్షలు చేసి నివేదిక అందజేస్తారు.



ఉమ్మడి వరంగల్‌లోని పొలాల్లో జింక్ లోపం..

ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు వరంగల్ జిల్లాలోని పొలాల్లో ఎక్కువ జింక్ లోపమున్నట్లు తేలిందని నిపుణులు చెబుతున్నారు. గతంలో పశువులు, గొర్రె ఎరువు పొలంలోని భూమిలో కలిసిపోయి ఎరువుగా మారడం వల్ల జింక్ ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో రైతులు రసాయన ఎరువులు వాడడంతో భూసారం తగిందని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

ప్రయోజనాలు..

భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమిలో మొక్కకు కావాల్సిన పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవచ్చు. సమస్యాత్మక భూములున్నా వాటి గురించి తెలుసుకుని వాటిని సవరించుకునే విధానాలు కూడా ఉపయోగించొచ్చు.

భూసార పరీక్షలు తప్పనిసరి



ఖరీఫ్‌లో అన్నదాత కచ్చితంగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. చెప్పిన విధంగా మట్టిని సేకరించి ల్యాబ్‌లో అందజేస్తే వారంలోపు నివేదిక ఇస్తారు. నివేదిక ప్రకారం పంటలకు ఎరువులు వేస్తే పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుంది.

-రవీందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

మట్టి పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి



సాగుకు ముందే మట్టి నమూనా సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలి. పరీక్షలు చేయించుకోవడం వల్ల అధిక దిగుబడులతోపాటు రసాయనిక ఎరువులు వాడకంలో ఖర్చులు తగ్గుతాయి. మట్టిపరీక్షలపై అవగాహన పెంచుకోవాలి.

-డాక్టర్ రాజన్న, కేవీకే కోఆర్డినేటర్, మామునూరు

బ్రాండెడ్ పేరుతో నకిలీ ఎలక్ట్రికల్ పరికరాలు విక్రయం

- పట్టుకున్న కంపెనీ బృందం


షాపులో తనిఖీ చేస్తున్న కంపెనీ బృందం, పోలీసులు

నెహ్రూసెంటర్ : బ్రాండెడ్ పేరుతో నకిలీ ఎలక్ట్రికల్ పరికరాలు (ఇంట్లో వినియోగించే విద్యుత్ పరికరాలు) విక్రయిస్తున్న షాపులో కంపెనీ బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీలో నకిలీ పరికరాలను గుర్తించి సీజ్ చేసింది. ఈ ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. గోల్డ్‌మెడల్ కంపెనీ రీజినల్ హెడ్ నాగేశ్వర్‌రావు కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని నీలం ఎలక్ట్రికల్ అండ్ శానిటరీ షాపులో బ్రాండెడ్ ఎలక్ట్రికల్ పేరుతో నకిలీ పరికరాలు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. ఇందులో నకిలీ ఎలక్ట్రికల్ పరికరాలు విక్రయిస్తున్నట్లు గుర్తించి ఎస్పీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. రాజస్తాన్ ప్రాంతం నుంచి వచ్చి షాపులను నిర్వహిస్తూ ఇలాంటి నకిలీ పరికరాలు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. నకిలీ ఎలక్ట్రికల్ పరికరాల వినియోగంతో విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తాయని, ప్రజలు నకిలీ పరికరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. టౌన్ ఎస్సై విజయ్‌కుమార్ సమక్షంలో తనిఖీలు చేపట్టి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

రైతులకు మేలు చేసేందుకు విత్తన చట్టం

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి


మాట్లాడుతున్న అన్వేశ్‌రెడ్డి

కాజీపేట అర్బన్ : రైతులకు మేలు చేసేందుకు విత్తన చట్టం ముసాయిదా తోడ్పడుతుందని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం హనుమకొండ జెడ్పీ హాల్‌లో ఏర్పాటు చేసిన నూతన విత్తన చట్ట ముసాయిదా తయారీకి కమిటీల అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో విత్తనోత్పత్తి చేస్తున్న రైతులు, పంటలు సాగు చేస్తున్న రైతులు నష్టపోకుండా ముసాయిదా ఏర్పాటు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఎక్కువ అమ్ముడవుతున్న ట్రూత్‌ఫుల్ విత్తనాలకు బదులు సర్టిఫైడ్ సీడ్‌లను డీలర్లు రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. భూభారతి చట్టం మాదిరి విత్తన చట్టం, మార్కెటింగ్ చట్టాల ముసాయిదా తయారు అవుతుందన్నారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా విడుదలైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని, వరంగల్ టీ-సీడ్స్ కూడా అందుబాటులో ఉంటాయన్నారు. డీలర్లు రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సునీల్‌కుమార్, నర్సింహారెడ్డి, శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, డీఏఓ రవీందర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

‘పహల్గాం’పై పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

న్యూశాయంపేట : పహల్గాం ఉగ్రఘటనపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని, కాల్పుల విరమణలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాత్రపై ప్రధాని మోదీ వివరణ ఇవ్వాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్, పాకిస్తాన్ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకుంటామని చెప్పి కాల్పుల విరమణకు ఒప్పించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనపై మోదీ జవాబు చెప్పాలన్నారు. ఆపరేషన్ కగార్ ఆపాలని వామపక్షాలు, మేధావులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేసినా పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. కేంద్ర బలగాలు.. మావోయిస్టుల మృతదేహాల ఎదుట నృత్యం చేయడం.. వారిని మోదీ, అమిత్ షా అభినందించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, లేదంటే ప్రజల చేతుల్లో గుణపాఠం తప్పదన్నారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు డబ్బులు లేవనడం సరికాదన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చుక్కయ్య, చక్రపాణి, వీరన్న, రమేశ్, వెంకట్, భానునాయక్, లింగయ్య, తిరుపతి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ఏటూరునాగారం : ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం 2025- 26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ముందు ‘దోస్తు’లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దీని వల్ల ఏటూరునాగారం తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో సులభంగా అడ్మిషన్లు పొందొచ్చని తెలిపారు. దోస్త్‌లో ఫస్ట్ ఫేజ్ రిజిస్ట్రేషన్ ఈనెల 24న ముగిసిందని, సెకండ్ ఫేజ్ ఈనెల 30 నుంచి జూన్ 6వ వరకు అవకాశం ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం 8332864686, 9515960845, 986 6242712 నంబర్లను సంప్రదించాలన్నారు.